# ఆడిన మాట



ఆర్.కె. కటూరి

**లంచం!**

**కథావస్తువుగా అనర్హమా!**

**ఎందుకవాలి?**

**ఇంతకీ... నేనేదో లంచం తరఫున వకాల్తా పుచ్చుకుని వాదిస్తున్నాననుకు నేరు! అదేంలేదు.**

ఆ రోజు ...

ఆఫీసులో తలొంచుకుని దీక్షగా డ్రాఫ్టు రాసుకుంటున్నాను.

రాస్తున్న డ్రాఫ్టులో ఏదో పాయింటుకోసం ఆలోచిస్తూ రాతఆపి, యథాలాపంగా మా హాలు ద్వారం వైపు చూశాను. అక్కడో వృద్ధుడు నిలబడి హాల్లో ఎవర్నో గుర్తుపట్టే ప్రయత్నంలో అందరి ముఖాలవంకా పట్టిపట్టి చూస్తున్నాడు.

రెండునిమిషాల్లో రాయటం పూర్తిచేసి తల పైకెత్తేసరికి ఆ వృద్ధుడు నా ఎదుటే నిలబడి ఉన్నాడు.

కుర్చీలో కూర్చోమని చేయిచూపించి, 'చెప్పండి' అన్నట్టుగా ఆయన ముఖంలోకి చూశాను.

"అయ్యా! మా రయిసుమిల్లుకి లయిసెన్సిచ్చింది నువ్వే కదూ!" అని ప్రశ్నించాడు, ధ్రువీకరించుకుంటున్నట్టుగా.

వివరాలడిగాను. చెప్పాడు.

* * *

ఒకరోజు ఈ వృద్ధుడే వెంట ఓ కుర్రాణ్ని కూడా తీసుకుని నా వద్దకొచ్చాడు. తను తెచ్చిన కవరు నాకిచ్చి, నేనందులో కాగితాలు తీసి పరిశీలిస్తుండగా తనంతట తాను తన గోడు చెప్పుకుపోసాగాడు.

"అయ్యా! ఈడొక్కడే కొడుకు మాకు. ఐస్కూలు దాకా సదివాడు. కాలేజీలో సేరమంటే ఇంక సదవనన్నాడు. పోనీ యవసాయం సేసుకోమంటే ఇష్టం లేదన్నాడు. అందుకని ఏది మాకుండేదాంటో రయిసుమిల్లు కట్టిచ్చిస్తే వాడి బతుకేదో వాడి బతుకుతాడని ఈ కాయితాలు పెట్టుకున్నాం. నువ్వెట్టాగైనా సరే మాకు లయిసెన్సిప్పిచ్చాల బాబూ!" అని ముగించాడు.

సాధారణంగా ప్రజలకి శాఖాపరమైన పద్ధతులు తెలియవు. తప్పనిసరిగా కొంత వ్యవధి పడుతుందని ఆ వివరాలు చెప్పాను.

కానీ గుమస్తాలకొక శాపం ఉంది. వాళ్లు నిజమే చెప్పినా జనం నమ్మరు. డబ్బుకోసం మెలిక పెడుతున్నారనే అనుకుంటారు.

నాకూ అదే పరిస్థితి ఎదురైంది.

"అయ్యా! మీ మామూలు పాతికంట గదా! నేను వందరూపాయలిస్తాను. ఇక్కడే పనయ్యేటట్టు సూడయ్యా!" అని ఆశపెట్టాడు.

"చూడండీ, నాకు డబ్బివ్వమని మీకెవరు చెప్పారో గానీ, నేను లంచం తీసుకునేవాణ్ని కాను. కాగితాలు రాసిపెట్టడం వరకే నా పని. తర్వాత విషయాలు మీరు చూసుకోండి. వాటితో నాకేం సంబంధంలేదు. ఇన్‌స్పెక్టర్‌గారికి మీ కాగితాలు పంపి ఆయన రిపోర్టు తెప్పించకుండా మీ పని

కాదు. కాకపోతే మీరింతగా అడుగుతున్నారు కాబట్టి, ఆయనకి పంపే కాగితాలు రాసి మీ చేతికే ఇస్తాను. తీసుకెళ్లి ఆయనచేత రిపోర్టు రాయించుకునిరండి!" అని చెప్పి, కాగితాలు తయారుచేసి అతనికే ఇచ్చి పంపాను.

నాలుగురోజుల తర్వాత ఒక సాయంత్రం మూడుగంటల ప్రాంతంలో రిపోర్ట్ తీసుకుని వచ్చాడు. దాన్ని చూశాను. సిఫారసు చేసి ఉంది.

"మీకు అప్రూవల్ ఇవ్వవచ్చని ఇన్స్పెక్టర్‌గారు రాశారు. మీ కాగితాలు తయారుచేస్తాను. కానీ మా ఆఫీసరుగారు కాంప్‌కెళ్లారు. అయిదు గంటల్లోగా తిరిగొస్తే ఆఫీసుకొస్తారు. ఆలస్యమైతే నేరుగా ఇంటికెళ్లిపోతారు. ఆఫీసుకి రాకపోతే ఇక మీరు రేపు రావాల్సుంటుంది!" అని అప్పటి పరిస్థితి చెప్పాను.

వెంటనే అతను, "అయ్యా! మళ్లీ రేపొచ్చే పని పెట్టకయ్యా!" అన్నాడు కంగారుగా.

"మరి ఆఫీసరుగారు రాకపోతే నేనేం చెయ్యను?"

"ఇంటికాడికయినా ఎల్లి బతిమాలుకుంటానయ్యా! రేపటికిమాత్రం వాయిదావెయ్యకయ్యా?" అన్నాడు ప్రాథేయపూర్వకంగా.

ఆ మాటనగానే నాకు కంగారుపుట్టింది. ఎందుకంటే ఏదో మాకుండేదాంట్లోంటే ఆఫీసు పని కాగానే ఒకచోటకి వెళ్లే పని పెట్టుకున్నాను. అదెక్కడాగిపోతుందోనని - "ఒక్క రోజులో ఏం పోతుంది?" అన్నాను కాస్త విసుగ్గానే.

"కాదయ్యా! జరిగిందంతా చెప్తాను" అన్నాడు దీనంగా.

అతని దైన్యాన్ని చూసి మరేమీ అనలేకపోయాను. అతను చెప్పనారంభించాడు.

"అయ్యా! మీకాడ్నించి కాయితాలు తీసుకుని ఇనసపెట్టరుగారుండే ఊరెల్లానయ్యా. ఆయన కూడా మీలాగ శానామంచోడు. మరసటి రోజే మా ఊరొచ్చి స్తలం సూసి రిపోరుటు రాసి తీసకెల్లమని నాకే ఇచ్చాడయ్యా! దాన్ని తీసుకుని మీకాడికి బయల్దేరతా ఉంటే ... పిల్లి సెకునంలాగ మా సరుపంచి, ఆయన తాబేదారు ఎదురుపడ్డారయ్యా, ఎక్కడికి పోతుండావ్ అని సరుపంచి అడిగాడయ్యా. నిజమే సెప్పాను. అదే నా కొంపముంచిందయ్యా!"

"ఏమైంది?"

"నువ్వొక్కడివే ఆపీసుకెల్లొద్దు. పెతి ఒక్కడు సెయ్యి జాపి నిన్నారిపేస్తారు. మీ ఆపీసరు నాకు బాగా తెలుసు. పని ఊరకనే సేయించి పెడతాను. రేపెల్దాంలే ఉండు! అని సెప్పాడయ్యా. ఆయన మాటినకపోతే బావుండదు. సరే అని, ఇయ్యాల పొద్దున్నే బయల్దేరి టవునుకొచ్చామయ్యా. ఆడ ఈ ఊరుకొచ్చే బస్సు ఎక్కబోతా ఉంటే ఆపి, ఆపీసరు దగ్గిరికి కారులో ఎల్తే గవురవంగా ఉంటది, పొద్దు బోయినా యెంటనే తిరిగి రావొచ్చు అని ఆయనే కారు మాట్టాడి అందులో తీసుకొచ్చారయ్యా నన్ను. ఊళ్లోకి రాగానే బోజనం ఏల్లైందని కారుని నేరుగా మిలట్రీ ఓటలుకి పోనిఇచ్చారయ్యా. ఆడ ఏందేందో తెప్పించుకుని తిన్నారు. బయిటికొచ్చినాక కిల్లీలు, సిగిరెట్టుపెట్టెలు తీసుకున్నారు. అప్పుడన్నా ఇక్కడికి తీసకొస్తారనుకుంటే, ఊళ్లో కాస్త పనుంది, సూసుకుని ఒకేపాలి ఆపీసుకెల్దాం అన్జెప్పి, చేడేడో తిప్పి యిప్పటికి తీసుకొచ్చారయ్యా ఇక్కడికి. ఒకేల సరుపంచి నా పని ఊరకే సేయించిపెట్టినా నాకొరిగింది ఏమీ లేదయ్యా. కారుబాడిగ, వాళ్లకయ్యే కర్సులు అన్నీ కలిపి ఈడిచ్చేదానికన్నా ఎక్కువే అయిందయ్యా! మీరుగనక రేపన్నారంటే, రాతిరి కుంటానికి లాడిజి తియ్యాల, మల్లా రేపంతా బోజనాలకి, కాపీ టిపిన్లకి కర్సులు ... ఇంక నేను నిజంగానే ఆరిపోతానయ్యా! నా మొకం సూసి ఎట్టాగో ఇయ్యాలే పని పూర్తిసేసిపెట్టయ్యా!" అని తన బాధంతా చెప్పుకున్నాడు.

'పాపం' అనిపించింది.

"సరేలెండి, అలాగే చేద్దాం. కనీసం మీ పనైనా ఫ్రీగా చేయించుకోండి!" అని సానుభూతిగా సలహా ఇచ్చి బయట కూర్చోమని పంపాను.





## ధనవంతుల్ని చేసిన హాబీ!

జస్టిస్ వైట్, గస్ గ్రే అనే ఇద్దరు హోలీ హాష్ ఆఫ్ బ్లూస్టోన్ సీనియర్ హైస్కూల్ టీచర్ అనుమతితో హాబీగా రకరకాల పరిశోధనలు చేస్తుంటారు. ఆవిధంగా ఓరోజు ఒక కొత్తపదార్థాన్ని వాళ్లు కనుక్కున్నారు. అది నీళ్లల్లో కరగదుకాని, ఉమ్మిలో కరుగుతుంది. అది పేపర్‌కి, స్టెయిన్‌లెస్‌స్టీల్‌కి అతుకుతుంది. పిప్పర్‌మెంట్ రుచిని కలుపుతే దాన్ని చాక్‌లెట్‌లా తినవచ్చు. ఎందుకంటే దాంట్లో ప్రొటీన్ పదార్థాలు అధికం. దాన్ని గాజుపలకలా చేయవచ్చుగాని, తేలిగ్గా విరుగుతుంది.

నాసా శాస్త్రజ్ఞులు, అమెరికన్ కంపెనీ డ్యూపాంట్ శాస్త్రజ్ఞులు ఈ కొత్తపదార్థాన్ని పరిశీలించి ఆసక్తి చూపారు. వైట్, గ్రే ఈ పదార్థానికి పేటెంట్ తీసుకున్నారు; దాన్ని కమర్షియల్ ప్రాడక్ట్‌గా మార్చే పరిశోధనలు చేస్తున్నారు; తర్వాత కొన్ని కోట్లు గడించే అవకాశం ఉంది.

**- డి. పద్మజ**

ఆరుగంటలదాకా చూశాను. ఆఫీసరుగారు రాలేదు. ఇంటికి ఫోన్‌చేస్తే రాలేదన్నారు. ఏడు గంటలకి మళ్లీ ఫోన్ చేశాను. వచ్చి ఉన్నారు. విషయం చెప్పాను. ఇంటికి తీసుకురమ్మన్నారు.

వాళ్లు నన్ను కారులో తీసుకెళ్తామన్నారు. గత్యంతరం లేదు. రిపేరులో ఉండి నాకారోజు సైకిల్ లేదు. వాళ్లతోటే వెళ్లాను.

మొదట నేను ఆఫీసరుగారిని కలిసి ఫైలు చూపించి, బయటికొచ్చి వాళ్లని లోపలికి పంపాను.

పది నిమిషాల తర్వాత ఆఫీసరుగారు నన్ను పిలిచి, "సర్పంచ్‌గారు నాకు బాగా తెలుసు! సంతకాలు పెట్టాను. పేపర్స్ ఇచ్చేయండి!" అని చెప్పారు.

బయటికొచ్చి వాళ్లకివ్వాల్సిన పేపర్లు, ప్లానులు సెట్‌చేసి, వృద్ధుడిచేత సంతకం పెట్టించుకుని ఇచ్చాను.

'థాంక్స్' అని చెప్పటం తెలిసి ఉండకపోవచ్చు. కానీ అతని కళ్లల్లో ఆ భావమే కనిపించింది.

ఈలోగా సర్పంచ్‌వాళ్లు బయటికొచ్చారు. నేను ఆఫీసరుగారి దగ్గరకెళ్లి సెలవు తీసుకుని వచ్చాను. అందరం రోడ్డుమీదికొచ్చాము. వాళ్లు కూచున్నాక కారు కదిలింది.

కనీసం ఆ ముసలాయనైనా వెళ్లొస్తామని చెప్పలేదు. నా మనసు నొచ్చుకుంది. వాళ్లమీద కోపం కూడా వచ్చింది. విలువ లేకుండా ప్రవర్తించారు. అపాత్రులకి సహాయం చేశాననిపించింది.

* * *

ఇది జరిగి దాదాపు రెండేళ్లయింది.

ఇన్నాళ్లకి మరల నా ఎదుట ఆ వృద్ధుడు!

"అవునండీ, నేనే! క్లియరెన్స్ కోసం వచ్చారా? ఇంత లేటుచేశారేం? మిల్లుకట్టడం ఆలస్యమైందా?" అని నా మామూలు క్రమంలో ప్రశ్నించాను.

నేనలా ప్రశ్నించగానే అతని ముఖంలో దుఃఖపు ఛాయలు అలుముకున్నాయి.

"నేనేడ కట్టానయ్యా మిల్లు?" హతాశుడైనట్టు గద్గద స్వరంతో అన్నాడు.

అతని ముఖం చూస్తే ఏవో కష్టాలనుభవించినట్టుగా ఉంది.

"ఎందుకని?" అడిగాను.

"మీకాడ లయిసెన్సు తీసుకున్నాక, ఇంక కలకటేరాపీసులో పనొక్కటే మిగిలిపోయిందయ్యా. అప్పుడే నాకు పెద్దజబ్బు సేసింది. శానా డబ్బు కర్సయింది. నా జబ్బు తగ్గిపోయేలోపల మా ఊళ్లో ఇంకొకళ్లు రయిసుమిల్లు మొదులుపెట్టారయ్యా. వాళ్లు మాకన్నా డబ్బున్నోళ్లు, సదువుకున్నోళ్లు. మాదసలే సిన్న ఊరు. మేం కూడ పెడితే వాళ్లతో పోటీకితట్టుకోలేమని మిల్లు కట్టటం ఇరమించుకున్నామయ్యా. డబ్బుకి డబ్బూ పోయి, మాకు సెని పట్టుకుందయ్యా!" అని డగ్గుత్తికతో చెప్పాడు.

నాకు నిజంగానే జాలేసింది.

"మా కర్మ ఇట్టా ఎందుక్కాలిందా అని ఏడవని రోజు లేదయ్యా మాకు ... రాత్రి నా బార్య - ఏందో ఉల్కిక్కిపడ్డట్టుగా లేసి కూసోని ... ఏమయ్యా! ఆ రోజు మనబ్బాయిని తీసుకొని ఏదో ఆపీసు కెల్లినప్పుడు ఎవురో గుమత్తా మంచోడని, ఆయనకి వంద రూపాయలిత్తానని సెప్పానన్నావు. మల్లీ సరుపంచోల్లతో ఎల్లినప్పుడు ఆల్ల మాటిని ఆ యబ్బాయికి ఏమీ ఇయ్యకుండా వచ్చానని బాద పడ్డావు, గురుతుందా? అని అడిగిందయ్యా. నేనేడ మర్సిపొయ్యానే, ఇప్పటికీ నా మనసులో అదే పీకతా ఉందే అని సెప్పానయ్యా. అప్పుడది ... ఎవుల్లకీ ఆసెపెట్టి మాట తప్పకూడదు, నువ్వెప్పుడూ ఆడి తప్పలేదు, మంచోల్ల మనసు కట్టపెడితే అదే సేప మై తగులుద్ది, ఆ యబ్బాయి మనుసు కట్టపెట్టావు. లేయ్యా, లేసి ఆ ఊరెల్లి ఆ యబ్బాయి కిత్తానన్న వందిచ్చిరా! అప్పుడైనా మన దోసం తొలిగిపోద్దేమో, లేయ్యా, లే! అని నన్ను సీకటితోటే తరిమిందయ్యా. ఆ రోజున ఆపీసరింటికాడ నువ్వు లోపలకెల్లినప్పుడు నీతో మాటాడొద్దని సరుపంచి నన్ను కటబ్టడి సేశాడయ్యా. అందుకే మేం ఎల్లిపోయేటప్పుడు కూడా నీకు మాట మాత్రం సెప్పలేదయ్యా నేను. నేను సేసింది తప్పేనయ్యా!" అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

నా మనసు చివుక్కుమంది. అంత పెద్దాయన ... ఏదో నేరం అంగీకరిస్తున్నట్టుగా నా ముందు కళ్లనీళ్లు పెట్టుకుంటుంటే చలించిపోయాను.

"చూడండి ... మీకు జబ్బు చేసినందువల్ల మిల్లు కట్టటంలో వెనకపడిపోయారు కానీ, మరింకేదీ కారణం కాదు. ఇలాంటి వన్నీ కేవలం మీ నమ్మకాలే!" అని అనునయించబోయాను.

"లేదయ్యా. నేనెప్పుడూ మాట తప్పలేదు. మీ దగ్గిరే అన్నమాట నిలబెట్టుకోలేకపోయాను. అందుకే మాకిట్టా జరిగింది. ఈ డబ్బు తీసుకోయ్యా!" అని సంచిలోంచి డబ్బు తీయబోతున్నాడు.

ఆయన తీసుకోమనటం, నేను వద్దనటం - ఆ దృశ్యం అందరి దృష్టిలోపడటం ఇష్టంలేక చప్పున పైకి లేచి, "నాతో రండి!" అంటూ బయటికి నడిచాను.

తిన్నగా కాంటీన్‌కి తీసుకెళ్లి కూర్చోబెట్టి అతనికి అర్థం కావాలని మళ్లీ చెప్పాను. కానీ నా మాటలు అతను వినిపించుకునే స్థితిలో లేడు. ఆ డబ్బు తీసుకోందే నన్ను వదిలేట్టు లేడు.

"నువ్వీ డబ్బు తీసుకోకపోతే నేనీడ్నుంచి ఎల్లనయ్యా!" అని మొండికేసి సంచిలోంచి వంద రూపాయల నోటు తీశాడు.

ఏం చేయాలో పాలుపోలేదు. కొద్ది క్షణాలు ఆలోచనలో పడ్డాను.

అతను ఇస్తున్నది లంచమే! కానీ అతని వ్యథలో ఇమిడివున్న సెంటిమెంటు - ఇస్తానన్న లంచం ఇవ్వలేకపోయానని కాదు - ఆడినమాట తప్పానని.

సంశయించకుండా అతని సెంటిమెంటుని కాపాడటం కోసం ఆ డబ్బుని స్వీకరించాను. ఆ సంఘటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా - ఆ వంద రూపాయలనోటును ఒక పాలిథిన్ కవర్లో సీల్ చేసి ఒక ప్రదర్శన వస్తువుగా అట్టే పెట్టుకున్నాను.

